మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై 15న ర్యాలీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈనెల 15న పాడేరు జిల్లా కేంద్రంలో అల్లూరి జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ భారీ ర్యాలీకి భారీ సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ,ప్రజలు హాజరై, విజయవంతం చేయాలని జిమాడుగుల మండల పంచాయతీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు సురబంగి రామకృష్ణ, కిముడు రాంబాబు, పిలుపునిచ్చారు. గిరిజనులకు మెరుగైన వైద్యము, అందించేందుకు వైయస్సార్సీపి పాలనలో పాడేరులో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సామాన్యులకు వైద్య విద్యను దూరం చేసే ఆలోచనలో మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్ట బెడుతుందన్నారు. వైద్య విద్యను అభ్యసించాలని ఆశపడే పేదవాళ్లందరికీ ద్రోహం చేయడమే అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థలో పాఠశాల

శిథిలావస్థలో వంట షెడ్డు

శిథిలావస్థలో పాఠశాల

- ఊడి పడుతున్న శ్లాబ్ పెచ్చులు
- అధ్వానంగా తరగతి గది
- మరమ్మతుకు నోచని వంట షెడ్డు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి బీసుపురం ప్రాథమిక ప్రైమరీ పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాడైన భవనంలో విద్యా బోధనలు కొనసాగిస్తున్నారు. అరుకు ప్రధాన రహదారికి ఆనుకొని ఈ పాఠశాల ఉంది. ఈ రహదారిపై జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి, ప్రభుత్వ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఈ పాఠశాలలో ఎగువ, దిగువ బీసుపురం గ్రామాలకు చెందిన సుమారు 40 మంది పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల భవనం నిర్మించి ఏళ్ళు గడుస్తుడటంతో పైకప్పు శ్లాబు, కింద గచ్చు, గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉన్న రెండు భవనాలతో తో పాటు వంట షెడ్డు, మరుగుదొడ్లు కూడా ఇదే పరిస్థితికి చేరాయి. వర్షాకాలంలో ఎప్పుడు ఈ భవనం కూలుతుందోనన్న భయంతో విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ విద్యాబోధన కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కొత్త పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పెచ్చులు ఊడుతున్న శ్లాబ్

పెచ్చులు ఊడిన తరగతి గది గచ్చు

సమస్యలపై నిలదీస్తున్న సిపిఎం సర్పంచ్ సునీత, సభ్యులు

మండల సమావేశంలో ...

సమస్యలపై గళమెత్తిన సభ్యులు

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- మండల గ్రామ అభివృద్ధి కొరకు ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో శనివారం ఎంపీపీ బి ఈశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ కు సంబంధించిన అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత, కొర్రాయి పంచాయతీ సర్పంచ్ కొమ్ములు, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కేహరి తోపాటు పలువురు సభ్యులు సమావేశంలో తెలియజేశారు. సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా అటెండర్‌తో పాటు చిన్నస్థాయి ఉద్యోగులను హాజరు పరచడం సరికాదని సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్‌ను పునరుద్ధరించి, కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలన్నారు. దీంతోపాటు పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, మండల సభ్యులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు'పై ర్యాలీ

ప్రజాశక్తి- హుకుంపేట:మన డబ్బులు-మన లెక్కలులో భాగంగా మండల కేంద్రంలో శనివారం శిక్షణ ఇచ్చినట్లు స్థానిక మహిళ సమైక్య ఏపిఎం అప్పయమ్మ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణలో సీఆర్‌పీలు నాగ వెంకట్ లక్ష్మి, మేరి పాల్గొని శిక్షణ అందించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం అప్పయమ్మ మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలు 'మన డబ్బులు - మన లెక్కల'పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. దీని ద్వారా సభ్యుల పొదుపు, రుణాలు తదితర ఆర్థిక వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సీఆర్‌పీలు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్వాసితులకు

న్యాయం జరిగేలా సహకారం

ప్రజాశక్తి -సీలేరు: పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా తమ వంతు సహాయ సహకారం అందిస్తామని సీలేరు కాంప్లెక్స్ ఎస్సీ సివిల్ జాకిర్ హుస్సేన్ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్సీ సివిల్ హనుమ దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇరువురు ఎస్ఇ జాకీర్‌హుస్సేన్‌కు శాండికోరి గ్రామానికి చెందిన బీమేశ్వరరావు, ప్రభు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులవుతున్న శాండికోరి గ్రామస్తులుకు పూర్తిస్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇటీవల జెన్కో అధికారులు నిర్వహించిన సమావేశంలో కూడా తమ గ్రామానికి మద్దతు ప్రకటించి అన్ని విధాల ఆదుకుంటే పంపుస్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి తమ గ్రామస్తులు సహకరిస్తున్నారని అలాగే తమకు అన్ని అమలయ్యేలా సహకరించాలని కోరామని అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఎస్సీ సివిల్ జాకీర్‌హుస్సేన్‌ను సన్మానిస్తున్న శాండికోరి గ్రామస్తులు

బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందక అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ సప్పర్ల చట్రాపల్లి, కొత్తూరు గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ అందక ఆరు నెలలగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి మొక్కల మహేష్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా ఉన్నాయని దీంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచాలతో సంబంధాలు తెగిపోయాయని విచారం వ్యక్తం చేశారు. వినియోగదారులు టాప్అప్ కార్డులు వేసుకున్నప్పటికీ నిరుపయోగంగానే అయిపోతున్నాయని వాపోయారు. బంధు మిత్రులు యోగక్షేమాలు తెలుసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సేవలు వినియోగంలో తెచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు భీమన్న, కొర్ర బలరాం, పూజారి లక్ష్మణ్, కొర్ర భాస్కర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

- కుటుంబానికి జెకెసి ట్రస్టు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చింతూరు : మండల కేంద్రంలోని గుబేలిపేటవీధికి చెందిన శతాధిక వ ద్ధురాలు శనివారం మృతి చెందడంతో స్థానికులు జెకెసి ట్రస్టు చైర్మన్ తెలుగుదేశం మండలా ధ్యక్షులు జమాల్ ఖాన్‌కు సమాచారం అందిం చారు. ఆయన మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ను పరామర్శించి అంత్యక్రియ లకు తన వంతు సాయంగా రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు రాజు. గ్రామస్తులు దాసరి

నగదు అందిస్తున్న జమాల్‌ఖాన్

వాహనదారులకు గండంలా పొగమంచు

దారకొండ రోడ్డులో వాహనాలు

దారకొండ ఘాట్‌లో రోడ్డు కనిపించక అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం దారకొండ ఘాట్‌రోడ్‌లో మంచు అధికంగా కురుస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల నుంచి చలి తీవ్రతతో పాటు మంచు కురుస్తుండడంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడపవలసిన పరిస్థితి ఏర్పడింది. మంచు కారణంగా రహదారి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క మన్యంలో మంచు అందాలు ప్రకతి అందాలు తిలకించడానికి పర్యాటకులు క్యూ కడుతున్నారు. లంబసింగిలో మైనస్ డిగ్రీలకి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో కాశ్మీర్‌ను తలపిస్తూ మంచు అందచందాలు పలువురిని మైమరిపిస్తున్నాయి. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. దీంతో మన్యంలో పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది.

మృతురాలు శైలజారాణికి అంత్యక్రియలు

ప్రజాశక్తి -చింతూరు: మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శైలజారాణి (64) మహిళ మృతదేహాన్ని చింతూరు ఆసుపత్రి మార్చురీ వద్దనే ఉంచారు. మిగతా ఎనిమిది మృతదేహాలను శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో వారి వారి గ్రామాలకు అంబులెన్స్ ద్వారా తరలించే ఏర్పాట్లు చేసి అనంతరం క్షతగాత్రులైన యాత్రికులను రాజమహేంద్రవరం నుంచి ఆర్టీసీ బస్సును తెప్పించి బాధ్యత గల అధికారిని బస్సులో ఏర్పాటు చేయడం జరిగింది. ఒక్కో అంబులెన్సులో ఒక్కో అధికారిని పోలీసుసిబ్బందిని కూడా అధికా రులు తగు జాగ్రత్తలతో మతదేహాలను వారి బంధువులకు అప్పగించేలా చర్యలు తీసుకున్నారు. శైలజారాణి మృతదేహాన్ని అక్కడే ఉంచాలని మేము వస్తామని ఆమె బంధువులు ఫోన్ ద్వారా అధికారులకు తెలపడంతో మార్చురీలోనే ఉంచారు. శనివారం మృతురాలి మేనల్లుడు వినయ్‌కుమార్ వచ్చి అధికారులను కలిసి పంచనామా అనంతరం ఖననం కార్యక్రమం పూర్తి చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులు ఎవరూ రానందున చింతూరు మండలంలోనే ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. జెకె సిటీ చైర్మన్ జమాల్‌ఖాన్ తన వంతు సాయంగా జెసిబిని ఏర్పాటు చేసి ఖననం చేసేందుకు సమాధిని ఏర్పాటు చేయడంతో స్థానిక అధికారులు తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్, ఎంపిడిఓ సున్నం శ్రీనివాస్‌దొర, సిఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ట్రస్టు సిబ్బంది

ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లిలో శనివారం నారా భువనేశ్వరి సహకారంతో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసిన వారికి కళ్ళజోడు ఈ నెల 21న రంపచోడవరంలో నారా భువనేశ్వరి చేతుల మీదుగా అందచేస్తారు. సుమారు 100 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీర్ ట్రస్ట్ డాక్టర్స్ డాక్టర్ దుర్గాప్రసాద్, స్టాప్ నర్స్, చిట్టి, జెఎస్ఎల్ మెడికల్ హాస్పిటల్ రాజమండ్రి డాక్టర్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో లోకల్ వాలంటీర్ డాక్టర్ పల్లాల రాజకుమార్‌రెడ్డి, పుత్సల.గురునాథ్‌రెడ్డి, కత్తుల వెంకట రమణరెడ్డి, రేవుల జానకిరెడ్డి, కర్రి సన్యాసిరెడ్డి, సారపు రాజన్న దొర, పూజారి ముత్యాలమ్మ, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రారంభించిన జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి - చింతూరు: చింతూరు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35 రోజుల పాటు కొనసాగే క్రికెట్ క్రీడా పోటీలను శనివారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్‌ఖాన్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ కరచాలనం చేశారు. టాస్ గెలిచిన ఎస్ఎఫ్ఐ ఎవెంజర్స్ బౌలింగ్ ఎంచుకున్నారు. ఎస్ఎఫ్ఐ ఎవెంజర్, సిసిఎ జట్లు తొలి మ్యాచ్లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సిసిఎ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యాభివద్ధిని గ్రామాభివద్ధి దేశాభివద్ధికి ఎంతో తోడ్పడతాయని చెడు వ్యసనాల నుండి దూరం ఉంచడమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని కూడా కాపాడే విషయంలో క్రీడలు ఎంతో తోడ్పాటుగా ఉంటాయన్నారు. మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతి 30 వేలు రన్నర్స్ విన్నర్స్‌కు మంచి విలువైన కప్పులను కూడా ఆయన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానికపెద్దలు ఇల్లా చిన్నారెడ్డి, పి. సాల్మన్‌రాజు, మండల అధ్యక్షులు బట్ట లక్ష్మణ్ రాజు, నరసింహారావు, చౌదరి సురేష్ పాల్గొన్నారు.

రహదారి లేని గ్రామాలు ఉండడం సిగ్గుచేటు

భారత ఆదివాసీ పార్టీ రంపచోడవరం ఇన్‌చార్జి అంజిరెడ్డి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం కుండాడ పంచాయతీ పరిధిలో తూరుమామిడి, కడుమూరు గ్రామాల్లో భారత ఆదివాసీ పార్టీ రంపచోడవరం ఇన్‌చార్జి మద్దిటి అంజిరెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ తూరుమామిడి, కడుమూరు గ్రామాల్లో పలు సమస్యలు ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అవుతున్నా ఈ రెండు గ్రామాలకు రహదారి సౌకర్యం కూడా లేకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. గతంలో కుండాడ పంచాయతీ నుండి తండ్రీ కొడుకులు చిన్నం జోగారావు, బాబు రమేష్ ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కానీ సొంత గ్రామానికి తారురోడ్డు వేయించుకోలేని దుస్థితి అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైనవారికి అందరికీ పింఛన్లు వచ్చేలా చూడాలని కోరారు. గ్రామస్తులు సిరిమన్న దొర, మడకం బాలుదొర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జాన్ వెస్లీ తదితరులు

ఘనంగా మెగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా మెగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆ అసోసియేషన్ ఫౌండర్ చీఫ్ రీవిలి జాన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు వాక్యోపదేశకులుగా రాజమండ్రి హోసాన్నా మినిస్ట్రీస్ కు చెందిన పాస్టర్ జాన్ వెస్లీ, ముఖ్య అతిథిగా విజయవాడ నుంచి ప్రొఫెసర్ కొడాలి విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. యేసుక్రీస్తు చూపిన బాటలో మనమంతా నడవాలని సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పాడేరు ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్, అరకు నియోజకవర్గ టిడిపి నాయకులు సివేరి అబ్రహం, జిల్లా, ఆయా మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు, పాల్గొన్నారు.

ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో విద్యార్థులతో ప్రో విసి గౌతమ్‌రావు తదితరులు

విదేశీ విద్యార్థులు 'గీతం రాయబారులు'

ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో ప్రో విసి గౌతమ్‌రావు

ప్రజాశక్తి - మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొందిన విదేశీ విద్యార్థులు ఆయా దేశాల్లో గీతం పేరు ప్రఖ్యాతులను వ్యాప్తిచేసే గీతం రాయబారులుగా పరిగణిస్తామని విశ్వవిద్యాలయం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతంలో వివిధ కోర్సులతో పాటు నర్సింగ్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశాలకు తిరిగి వెళుతున్న విద్యార్థులకు శనివారం ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవం నిర్వహించి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటోందని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతోందని చెప్పారు. ఏటా విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో తదనుగుణంగా సౌకర్యాలపై దృష్టి సారించామన్నారు. దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశన్ బాలు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. నూతన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శుభేందు సమంత కుటుంబ సభ్యులతో, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యులు సుధా నారాయణమూర్తి వేర్వేరుగా దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

చింతపల్లిలో గెలుపొందిన జట్టు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో శనివారం చింతపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల-1 ప్రాంగణంలో జరిగాయి. క్రికెట్ పోటీల్లో చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. తొలి మ్యాచ్‌లో చింతపల్లి మండల ఉపాధ్యాయులతో తలపడిన కొయ్యూరు మండల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. అనంతరం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గూడెం కొత్తవీధి మండల ఉపాధ్యాయులు 87 పరుగులు చేసి రన్నర్‌అప్‌గా నిలిచారు. కొయ్యూరు మండల ఉపాధ్యాయులు 102 పరుగులు చేసి విజేతలుగా నిలవగా, నిర్వాహకులు విజేత జట్టును అభినందించారు. చదువుతో పాటు క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతో అవసరమని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా క్రీడా రంగంలో చురుకుగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: క్రీడలు శరీర దృఢత్వంతో పాటు మానసిక ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని, ఉపాధ్యాయులు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలవాలని మండల విద్యాశాఖ అధికారి బాబూరావు సూచించారు. ఉపాధ్యాయ డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో జి.మాడుగుల మండలానికి చెందిన ఉపాధ్యాయులు త్రోబాల్‌లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ క్రమంలో శనివారం పాడేరులో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో జి.మాడుగుల ఉపాధ్యాయుల జట్టు త్రోబాల్ విభాగంలో ప్రత్యర్థి జట్లను ఓడించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. విజయం సాధించిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి బాబురావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడేరు : అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు శనివారం నుంచి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలను చేపట్టారు. ఈ డివిజన్ స్థాయి క్రీడా పోటీలను జిల్లా ఉపవిద్య శాఖ అధికారి సోమేలి చెల్లయ్య, మండల విద్యాశాఖ అధికారి మోరి జాన్ ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని మండలాల ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా ముచంగిపుట్టు, పెదబయలు, పాడేరు, జి.మాడుగుల మండలాల టీములకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి పాంగి సూరిబాబు, మాజీ కార్యదర్శి వండలాం కొండబాబు, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మత్స్యరాస భూపతిరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

జి.మాడుగులలో గెలుపొందిన త్రో బాల్ జట్టు

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని బైకిస్టు మృతి

మృతిచెందిన రఫీ

ప్రజాశక్తి అనంతగిరి :మండలంలోని కాశీపట్నం -కొత్తూరు పంచాయతీ గ్రామాల మార్గమధ్యలో కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన రఫి (35) మృతి చెందాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో అనంతగిరి నుండి తిరుగు ప్రయాణం ఎస్ కోటకు బైక్‌పై వెళ్తున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో రఫీ తీవ్రంగా గాయాల పాలయ్యాడు. వైద్యం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ ముగింపులో బహుమతులు అందిస్తున్న అతిథులు

గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్' ముగింపు

ప్రజాశక్తి-మధురవాడ : యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్' ఫైనల్ పోటీలు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ముగిశాయి. ఈ స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు, 171 మంది యువతీయువకులు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న జట్లకు ప్రభుత్వ విభాగాలైన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి)కి సంబంధించిన 5 అంశాలపై పరిష్కార మార్గాలు తెలపాల్సిందిగా కోరారు. ఈ పోటీలకు ఎఐసిటిఇ అధికారులు, సిద్ధార్థ శర్మ, రంగనాధ్‌ఓజా పాటు ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు సుకేందు దత్తా, రిషిమహజన్, రంజిత్ కుమార్ మిశ్ర, అరవిందు కుమార్, ఇండోటిబిటెన్ బోర్డర్ పోలీస్ డిఐజి పవన్ మాలిక్, డిప్యూటీ కమాండెంట్ గౌతమ్‌కుమార్, ట్రైనీటెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వి.సత్యేంద్ర, కృత్రిమ మేధ నిపుణుడు సూరజ్ వంక, గీతం ప్రొఫెసర్లు ఆర్.రాజేశ్వరరెడ్డి, క్రాంతికిరణ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విశాఖ పర్యవేక్షకుడిగా గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రోత్సాహక నిధుల కోసం కాఫీ రైతుల ఆందోళన

ఆందోళన చేస్తున్న కాఫీ రైతులు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని 16 పంచాయతీల గ్రామాల్లో ఆర్గానిక్ కాఫీ, మిరియాలు వంటి తోటలను పెంపకం చేపడుతునామని, తమకు ప్రోత్సాహక నిధులు తక్షణమే చెల్లించాలంటూ కాఫీ కార్మికులు టోకూరు పంచాయతీ బోడగుడలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు ఎస్.ఆనందు, ఎస్.రామన్న, లక్ష్మణ్ లు మాట్లాడుతూ, పనులకు సంబంధించి ప్రోత్సాహక నిధులను ప్రభుత్వం రైతులకు 2024 - 25 సంవత్సరాలకు సంబంధించి చెల్లించవలసిన నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. నిధులను అందిస్తున్నట్లు సంబంధిత ఉన్నత అధికారులు చెప్పడం తప్ప ఒక రైతుకి కూడా పెట్టుబడి ఖర్చులు చెల్లించిన దాఖలు లేవన్నారు. ఎకరానికి 30 వేల రూపాయలు పైగా పెట్టుబడి ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ కాఫీ తోటల పెంపక ప్రోత్సాహక నిధులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 15 రోజుల్లో చెల్లించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు.

నోటి కేన్సర్‌పై దంత వైద్యుల వాక్‌థాన్

ప్రజాశక్తి -మధురవాడ : నోటి కేన్సర్‌పై ప్రజలలో అవగాహన కల్పించడానికి గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు, అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లోఫేసియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, కేన్సర్ క్యూర్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం స్థానిక బీచ్ రోడ్డులో విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు, పొగాకు సంబంధ ఉత్పత్తులు గుట్కా వంటివి వాడకం ద్వారా నోటి కేన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. దంత వైద్యులు బాధ్యతగా దీనిపై ప్రజలను చైతన్య పరుస్తున్నారని పేర్కొన్నారు. గీతం దంత కళాశాల డాక్టర్ ఎన్‌వివి.సత్యభూషన్ మాట్లాడుతూ, ప్రాథమిక దశలో నోటి కేన్సర్‌ను గుర్తించి చికిత్స అందించడంలో మాక్సిల్లోఫేసియల్ సర్జన్స్ పాత్ర కీలకమని తెలిపారు. కాళీమాత ఆలయం సమీపం నుంచి వైఎమ్‌సిఎ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో 200 దంతవైద్య విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.నరసింహరావు, గీతం వైద్య నిపుణులు డాక్టర్ ఎమ్.సతీష్, మాక్సిల్లోఫేసియల్ సర్జన్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ వినోద్ బిర్రా, డాక్టర్ ఎ.భగవాన్‌దాస్ రాయ్, డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సత్తిబాబును పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మాదిరెడ్డి సత్తిబాబుకు మాతృవియోగం

సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి -విఆర్‌పురం: రేకపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు తల్లి మాదిరెడ్డి అమతవల్లి తాయారమ్మ (104) శనివారం తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె భౌతికాయాన్ని సిపిఎం నాయకులు సందర్శించి తాయారమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, నాయకులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, నాలారపు ప్రకాష్‌రావు ఆత్మకూరి కాంతారావు, సోడి మల్లయ్య తదితరులు పరామర్శించారు.

తల్లిదండ్రులు, గురువుల రుణం తీర్చుకోలేనిది

సినీ నటుడు సుమన్

ఘనంగా అల్యూమ్ని మీట్-2025

ప్రజాశక్తి- ఎంవీపీ కాలనీ: తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువుల రుణం తీర్చుకోలేమని, సినీ హీరో సుమన్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని' ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన 'అల్యూమ్ని మీట్-2025ను సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎఎం బిజినెస్ స్కూల్ అధినేత డాక్టర్ ఎస్.పి రవీంద్ర మాట్లాడుతూ అత్యున్నత విలువలు, ఉన్నతాశయాలతో తన తండ్రి ఆళ్వార్‌దాస్ స్థాపించిన తమ విద్యాసంస్థలలో చదివి నేడు అత్యున్నత స్థానాలకెదిగిన 38 బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 'రి యూనిటీ, ఇంట్రెక్ట్ హేవ్ ఫన్' అనే థీమ్‌తో ఒక చోటచేరి వారి అనుభవాలను పంచుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఐఐఎం బిజినెస్ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజముత్యం ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో అధికారిక హ్యాండిల్స్‌ద్వారా ఈ కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో ఐఐఎం డైరెక్టర్ జనరల్ ఆచార్యకృష్ణ మోహన్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మిరియాల వెంకటరావు జయంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దివంగత మిరియాల వెంకటరావు జయంతి వేడుకలను ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఏరినాలో నిర్వహిస్తున్నట్లు మిరియాల వెంకటరావు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కటారి అప్పారావు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ట్రస్ట్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,1939 డిసెంబర్ 25న రాజమండ్రిలో జన్మించిన మిరియాల, ప్రకాశం జిల్లా నేపథ్యం కలిగినా, విజయవాడలో ఎక్కువ కాలం గడిపారన్నారు. విద్యార్థి దశ నుంచే సామ్యవాద భావాలతో ఆకర్షితుడై,తర్వాత కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లారని తెలిపారు. ట్రేడ్ యూనియన్లలో రిక్షా కార్మికులు, ఫ్యాక్టరీ వర్కర్ల సంఘాల నేతగా పనిచేశారన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనసాంద్రత కలిగిన కాపు కులంలో 27 శాతం మంది ఉన్నారని వారికోసం ఉద్యమాలు నడిపారన్నారు.1980లో విజయవాడలో వంగవీటి మోహన్‌రంగ రాజకీయంగా ఎదుగుతున్న దశలోఎంతో కీలకపాత్ర పోషించారన్నారు. శత జయంతి ఉత్సవాల మేరకు ప్రతి ప్రాంతంలోని ప్రతి ఏడాది ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోసం..

ఉత్సాహంగా బీచ్ వాక్

బీచ్ వాక్ చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ శనివారం ఉదయం 6.30 గంటలకు విశాఖ తీరంలోని కాళీమాతా టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకూ బీచ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా పూర్వ కార్యదర్శి ఎ.అజశర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఎర్ర షర్టులు, చీరలు ధరించి సంఘం నాయకులు, కార్మికులు బీచ్ వాక్‌లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారినుద్దేశించి అజశర్మ మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులను, కార్మిక సంఘాలను ఐక్యం చేసి మహత్తర పోరాటాలు చేపట్టిందన్నారు. కార్మికవర్గ సమస్యలపై నిఖరంగా పోరాడి అనేక విజయాలు సాధించి, దేశంలోనే అతిపెద్ద సంఘంగా ఏర్పడిందన్నారు. సిఐటియు ఏర్పడిన 55 ఏళ్ల తరువాత ఆంధ్ర రాష్ట్రంలో అఖిల భారత మహాసభలు జరుగుతున్నా యన్నారు. విశాఖలో, ఆంధ్ర రాష్ట్రంలో కార్మికుల సమస్యలపై సిఐటియు ఉద్యమిస్తోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, డిసిఐ, షిప్‌యార్డు, బిహెచ్‌పివి వంటి అనేక ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నగా అడ్డుకున్న ఏకైక సంఘం సిఐటియు అని గుర్తు చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన సిఐటియు నాయకత్వం విశాఖపట్నానికి రావడం, ఇక్కడ ఐదురోజుల పాటు మహాసభలు జరపడం విశాఖ కార్మికవర్గానికి ఒక వరమని అభివర్ణించారు. ఈ మహాసభలకు విశాఖ కార్మికవర్గం, ప్రజానీకం సహాయ, సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖలో వేలాది మందితో జరిగే ప్రదర్శన, బహిరంగ సభలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, కెఎం.కుమార్ మంగళం, బి.జగన్, జె.అయోధ్యరామ్, పి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, అరుణ్, శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, బి.వెంకటరావు నమ్మి రమణ, మాధవి, పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

9 జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

విశాఖ ఎకనామిక్ రీజియన్‌తో మేలు

మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతంలోని తొమ్మిది జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ అంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకమైన అభిమానమన్నారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ జిల్లా వరకూ తొమ్మిది జిల్లాలతో విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటు చేశారన్నారు. ఉత్తరాంధ్రను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న తలంపులో ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించారన్నారు. వచ్చే నెలలో వైజాగ్ బీచ్ ఫెస్టివల్ నిర్వహించ బోతున్నామన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం శాసన సభ్యులు పలువురు మాట్లాడుతూ ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖ ముందంజలో ఉందన్నారు. శుక్రవారం తొమ్మిది ఐటి కంపెనీలకు శంకుస్థాపన జరిగిందన్నారు. మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. దీంతో విశాఖ ముఖ చిత్రం మారనుందని తెలిపారు. 2031కి 10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ సెక్టార్లు, 49 ప్రాజెక్టులు ఉంటాయని, ప్రతి మూడు నెలలకు ఒకసారి వీటిపై సమీక్ష ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, ఎపి గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారు

మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆంధ్రరాష్ట్రం ఈ 18 నెలల కాలంలో అప్పులాంధ్రప్రదేశ్‌గా మిగిలిపోతోందని, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 18 నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏకంగా రూ.2,66,175 కోట్ల అప్పు చేసిందని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆక్షేపించారు. శనివారం సాయంత్రం లాసన్స్‌బే కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో చేసిన రుణంలో, దాదాపు 80 శాతం కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలోనే చేసిందని ఆయన గుర్తు చేశారు. అయితే అప్పుడు రెండేళ్లు కోవిడ్ సంక్షోభం ఉన్న విషయాన్ని మర్చి పోవద్దన్నారు. వైసిపి ప్రభుత్వం అప్పు చేసినా, ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకాన్ని, కార్యక్రమాన్ని ఆపలేదని, దాదాపు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ రూపంలో వివిధ పథకాల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో ఓ వ్యూహం ప్రకారం వైఎస్సార్సీపీ ప్రభుత్వం 14 లక్షల కోట్ల అప్పు చేసిందని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, పురంధేశ్వరి ఇష్టానుసారం అంకెలు చెప్పి ఆరోపణలు చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తున్నారా? ఏదీ అమలు చేయకపోయినా అంత నిస్సిగ్గుగా ఎలా ప్రచారం చేసుకుంటున్నారు అని మండిపడ్డారు. మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు , అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9 కుటుంబాలకు నగదు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బంగ్లాదేశ్ చెరలో ఉన్న విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన 9 మత్స్యకార కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల చొప్పున బియ్యం అందజేసి ఆదుకున్నారు. శనివారం ఆశీలమెట్ట కార్యాలయంలో నగదు పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కుటుంబాల్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, తక్షణమే ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా నోరుమెదపక పోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎర్నమ్మ గుడి చైర్మన్ లండ రమణ, సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, సెక్రటరీ బొడ్డు ఆనంద్, బర్రి కొండలరావు, 37వ వైసిపి వార్డు ప్రెసిడెంట్ ఆకుల ఏసు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంటూరు ఆనంద్, చోడిపిల్లి శివ, చేపల నూకరాజు (బుడ్డి), వేణు, 30వ వార్డు వైసిపి మహిళా ప్రెసిడెంట్ సూరని రాము,సౌత్ మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడలేకే వైసిపి అవాకులు చవాకులు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నజీర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జగన్ హయాంలో గంజాయి హబ్‌గా విశాఖ మారిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖలో జరుగుతున్న అభివద్ధిని చూసి ఓర్వలేక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, వైసిపి ప్రభుత్వ హయాంలో విశాఖను గంజాయి హబ్‌గా మార్చారని విమర్శించారు. ఐటికి ఊటీగా విశాఖ ఊహించని అభివద్ధి చెందుతోందన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చొరవతో దిగ్గజ ఐటి సంస్థలు విశాఖకు వస్తున్నాయని, విశాఖ ఐటీ హబ్, డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతుందని తెలిపారు. నిన్న ఒక్కరోజే 9 సంస్థలకు ఇక్కడ శంకుస్థాపనలు జరిగాయని వివరించారు. ఐటి దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని, ఐటి సంస్థలు వలన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు మార్చి నెలలో శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. విశాఖ భవిష్యత్ లో ఐటి రంగంలో మొదటి స్థానంలో ఉండబోతుందని చెప్పారు. వైసిపికి రాజకీయ పార్టీగా ఉండడానికి అర్హత లేదని, జగన్ కేవలం రాజకీయం కోసం పార్టీ పార్టీ నడుపుతూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి బొట్టా పరదేశి యాదవ్,రాష్ట్ర ఐటిడిపి ప్రధాన కార్యదర్శి గరికిన ప్రతాప్ పాల్గొన్నారు.

సర్వైకల్ కేన్సర్‌పై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ/విశాఖ కలెక్టరేట్ : సర్వైకల్ కేన్సర్ వ్యాధి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. శనివారం పోలీస్ బ్యారెక్స్‌లో లయన్స్ క్లబ్, చైతన్య స్రవంతి సంయుక్తంగా ఏర్పాటు చేసిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా పోలీస్ సిబ్బంది కుమార్తెల కోసం ఉచిత హెచ్‌పివి వేక్సినేషన్ ప్రోగ్రాం చేయడం ఆనందంగా ఉందన్నారు. 9 నుండి 14 వయసులోని బాలికలు ఈ వేక్సిన్ వేసుకుంటే సర్వైకల్ కేన్సర్ బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ సిరిన్ రెహమాన్, రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరోజిని, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్థోపెడిక్ డాక్టర్ శరత్, ఎయు మాజీ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ బి.రవిచంద్ర, అశోక్ కుమారి, ఉపాధ్యక్షులు డాక్టర్ జె విజయ్ శంకర్, ఎడిసిపిలు రాజ్ కమల్, ప్రవీణ్ కుమార్, నారాయణరావు పాల్గొన్నారు.